# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

# రేడియో శ్రీలంకద్వారా క్రీస్తు సంఘముల
# కార్యక్రమములు

తెలుగు : సత్యవాణి (The Voice of Truth)
ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం 2-15 గంటలకు.

తమిళం : సత్యవాజి (The Way of Truth)
మంగళవారం - 5-30 p.m.
గురువారం }
ఆదివారం } - 6-45 p.m.

మలయాళం : The Voice of Truth
మంగళ, శుక్రవారాలు 8-45 p.m.

కన్నడ : The Voice of Truth
ఆదివారం - 1-45 p m.

హిందీ : సత్యసుసమాచార్
మంగళ, గురు, శుక్రవారాలు 9-00 p.m.
ఆదివారం - 12-45 to 1-00 p.m.

ఇంగ్లీషు : The Voice of Truth
సోమవారం - 9-00 p.m.
శుక్రవారం - 7-45 p.m.

---

ఈ కార్యక్రమాలను అందరు వినండి. అందరికీ విన్పించండి.

---

Razan Electric Press, Kakinada-1.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

**Editor :** J.C. CHOATE | **Managing Editor :** JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 10 | ఏప్రిల్ 1990 | సంచిక 9


# సంపాదకీయము

## బైబిల్ క్విజ్

## ( Bible Quiz )

మీ కొరకు ఒక బైబిల్ క్విజ్ ఏర్పాటు చేస్తున్నాం. ఈ ప్రశ్నలకు జవాబులు వ్రాసి, పదాలను నిర్వచించి, ఖాళీలను పూరించి దేవుని వాక్యాన్ని గూర్చి, రక్షణనుగూర్చి మీ కెంత అవగాహన ఉన్నదో గమనించండి. మీకు అవసరమైతే బైబిలును గాని క్రొత్త నిబంధన గ్రంథాన్ని గాని సహాయంగా తీసుకొనండి. అదే మీకు చివరి ఆధారము. వీటికి జవాబులు క్విజ్‌కు తరువాత ఇవ్వబడ్డాయి. ప్రశ్నలన్నీ మీరు పూర్తిచేసేవరకూ జవాబులను చూడవద్దు. మీరు వ్రాసిన జవాబులను సరయిన జవాబులతో పోల్చి మీ అనుభవాన్ని ఒకసారి పరీక్షించుకోండి. మీరు అత్యుత్తమమైన స్థితిలో ఉండాలని కోరుచున్నాము. మీకు ఈ క్విజ్‌లో ఎక్కువ మార్కులు రాకపోయినట్లయితే మీరు ఎక్కువగా దేవుని వాక్యాన్ని పఠించవలసి యున్నది. మీరు వీటిని పూరించగలరని మేము నమ్ముచున్నాము.

I ఈ మాటలు ఎవరు చెప్పారు?

1. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మని వానికి శిక్ష విధింపబడును"
2. "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు"
3. "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతి వానికి మొదట యూదునికి, గ్రీసుదేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది"
4. "ప్రాణములేని శరీరమేలాగు మృతమో అలాగే క్రియలులేని విశ్వాసమును మృతము"
5. "ఆయనను బట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే"

II ఈ వచన భాగాలయొక్క 'రిఫరెన్సులు' యివ్వగలరా?

1. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను"
2. "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెను"
3. "ఆనందముతోను నిష్కపటమైన హృదయముతోను ఆహారము పుచ్చుకొనుచు నుండిరి. మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో చేర్చుచుండెను"

4. "దేవుని యెదుట యోగ్యునిగాను సిగ్గుపడనక్కరలేని పనివాని గాను సత్యవాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవుని యెదుట కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము"

5. "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక ఆ పేరునుబట్టియే దేవుని మహిమ పరచవలెను"

III సరయిన జవాబును గుర్తించుము.

1. సంఘ మనగా :
   1. ప్రార్థన చేయునట్టి ఒక మందిరము 2. ఒక మతశాఖ
   3. క్రీస్తుకుచెందిన రక్షింపబడిన ప్రజల సమూహము.
2. బాప్తిస్మమనగా :
   1. చిలకరింపు 2. కుమ్మరింపు 3. ఒక సమాధి లేదా నీటిలో ముంచబడుట
3. సంఘమునకు శిరస్సు ఎవరు ?
   1. క్రీస్తు 2. పోపు 3. మానవుడు
4. క్రైస్తవులు ఆరాధనకు వారములో ఏ దినాన కూడుకొన వలసి యున్నది.
   1. సబ్బాతు దినము 2. వారములో మొదటి దినము లేదా ఆదివారము 3. శుక్రవారము
5. క్రీస్తుయొక్క సంఘములో ఒకడు ఎట్లు సభ్యుడు కాగలడు.
   1. చేరుట ద్వారా 2. ఓటు వేయుట ద్వారా 3. రక్షింపబడిన వారిని క్రీస్తు ఆయన సంఘములో చేర్చును.

IV నిర్వచింపుము

1. మారుమనస్సు
2. ప్రభురాత్రి భోజనము

3. ప్రార్థన
4. పరిశుద్ధ పరచబడుట
5. ఏకత్వము

## V. సంఘమును గూర్చిన ప్రశ్నలు

1. క్రీస్తు ఎన్ని సంఘములను స్థాపించెను ?
2. ఆదిమ సంఘము ఏపట్టణములో స్థాపింపబడెను ?
3. రక్షింపబడినవారిని ఎవరు సంఘములో చేర్చుదురు ?
4. సంఘము దేనితో కొనబడెను ?
5. సంఘమునకు శిరస్సు ఎవరై యున్నారో చెప్పగలవా ?

## VI జవాబు చెప్పవలసిన మరికొన్ని ప్రశ్నలు

1. రక్షణపొందుటకు ఒకడు ఏమి చేయవలసియున్నది ?
2. ఆరాధన యందలి అంశముల పేర్కొనుము ?
3. మనమందరము యేకమై యుండవలెనని క్రీస్తు ఎందుకు ప్రార్థించెను ?
4. క్రీస్తు తిరిగి వచ్చుట ఏమనుష్యునికైనను తెలియునా ?
5. జీవ కిరీటమును పొందుట కొరకు ఎంతకాలము మనము నమ్మకముగా నుండవలసి యున్నది ?

## VII ఔనా ? కాదా ?

1. మత్త 6 : 9-15లో ప్రభువు ప్రార్థన కలదు.
2. యోహాను బాప్టిస్టు సంఘ సభ్యుడైనందున బాప్తిస్మమిచ్చు యోహానని పిలువబడెను.
3. మనము మోషే ధర్మశాస్త్రము క్రింద ఇంకనూ జీవించవలసిన అవసరము లేదు.

4. పేతురు సంఘమునకు మొట్టమొదటి పోపు.
5. పుచ్చుకొనుట కంటె, యిచ్చుట ధన్యమని యేసు బోధించెను.

## VIII ఖాళీలను పూరింపుము

1. యేసు చెప్పెను "నేనే—ను,—ను,—ను; నా ద్వారా తప్ప ఎవడును తండ్రి యొద్దకురాడు" (యోహా 14:6).
2. పౌలు చెప్పెను. "వేయబడినది తప్ప మరియొక పునాది ఎవడును వేయనేరడు. ఆపునాది—" (1 కొరింథి 3 : 11).
3. మొట్టమొదట అంతియొకయులో శిష్యులు — అన బడిరి (అపొ. కా. 11 : 26)
4. "— వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును (రోమా 10 : 17).
5. "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోక మందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారియెదుట మీ — ప్రకాశింప నియ్యుడి.

## IX తప్పు లేక ఒప్పు

1. మనము సమస్తము క్రీస్తు పేరట చేయవలెను (కొలస్స 3 : 17)
2. విభజనలు లేదా భేదములు కల్పించువారిని గుర్తించగల మని పౌలు చెప్పెను (రోమా 16 : 17, 18)
3. సంఘములో సభ్యుడు కాకుండ ఒకడు రక్షింపబడగలడు (అపొ. కా. 2 : 47, ఎఫెస్సీ 5 : 23)
4. యేసు మరల తిరిగి వచ్చుట లేదు (యోహా 14 : 1-3)

5. సువార్త లేక మంచివార్త అనగా క్రీస్తు మరణ సమాధి, పునరుత్థానములు ( I కొరింథీ 15 : 1-4).

ఈ పరీక్షను నీ స్నేహితులతో ఎందుకు పాలు పంచుకొన కూడదు ? అట్లు చేసినట్లయితే అందరికీ మేలు జరుగుతుంది. యిలాంటి అనేక క్విజ్‌లు మీకు కావాలంటే మాకు తెలియజేయండి.

## జ వా బు లు

I ఎవరు చెప్పారు: 1. క్రీస్తు 2. పేతురు 3. పౌలు 4. యాకోబు 5. యోహాను.

II రిఫరెన్సులు: 1. యోహా 3:16, 2. యోహా 4:24, 3. అ.కా. 2 : 47, 4. 2 తిమోతి 2 : 15, 5. I పేతు 4 : 16.

III సరయిన జవాబులు గుర్తించుము

1. క్రీస్తుకు చెందిన రక్షింపబడిన ప్రజల సమూహము
2. ఒక సమాధి లేదా నీటిలో ముంచబడుట
3. క్రీస్తు
4. వారములో మొదటి దినము లేనా ఆదివారము
5. రక్షింపబడిన వారిని క్రీస్తు ఆయన సంఘముతో చేర్చును.

IV 1. హృదయము యొక్క మార్పు లేక తిరిగి మరో మార్గంలో ప్రయాణించుట.
2. రొట్టెను క్రీస్తు శరీరానికి సాదృశ్యముగాను ద్రాక్షా రసమును ఆయన రక్తమునకు సాదృశ్యముగానుతీసికొనుట.
3. దేవునితో మాటలాడుట.
4. దేవుని నిమిత్తమై ప్రత్యేకించబడుట.
5. క్రీస్తుతో యేకమైయుండుట.

V సంఘమును గూర్చిన ప్రశ్నలు

1. ఒక్కటే 2. యెరూషలేము 3. క్రీస్తు 4. క్రీస్తు రక్తము 5. క్రీస్తు

VI జవాబు చెప్పవలసిన మరికొన్ని ప్రశ్నలు.

1. దేవునియందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, నోటితో క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తమై మారుమనస్సు పొందవలెను (హెబ్రీ 11 : 6, అపొ. కా. 17 : 30, మత్త 10 : 32, అపొ. కా. 2 : 38).
2. దేవుని వాక్యమును పఠించి (2 తిమోతి 2 : 15) ప్రార్థించి (అపొ. కా. 2 : 42) పాడి (ఎఫెసీ 5 : 19) ప్రభురాత్రి భోజనము నాచరించి (I కొరింథి 11 : 23-29) వర్ధిల్లిన కొలది యివ్వవలెను (I కొరింథి 16 : 2).
3. దేవుడు క్రీస్తును పంపెనని లోకము నమ్మునట్లు మనము క్రీస్తుతో యేకమైయుండవలెనని ప్రార్థించెను.
4. తెలియదు
5. మరణము వరకు

VII ఔనా ? కాదా ?

1. కాదు. ఈ వచన భాగంలో శిష్యులెట్లు ప్రార్థించాలో ఆయన తెలియజేసెను.
2. కాదు. ఆ కాలంలో అట్టి సంఘమే లేదు.
3. లేదు.
4. కాదు.
5. అవును.

VIII ఖాళీలు

1. మార్గము, సత్యము, జీవము
2. యేసుక్రీస్తు
3. క్రైస్తవులు
4. వినుట
5. వెలుగు

IX తప్పు లేక ఒప్పు

1. ఒప్పు 2. ఒప్పు 3. తప్పు 4. తప్పు 5. ఒప్పు

— జె. సి. ఫోట్.

---

పది ఆజ్ఞలు :

# క్రీస్తు చట్టము యొక్క ఔన్నత్యము

## ( Superiority of Christ's Law )

యూదా మతం క్రైస్తవ్యానికి మూలాధారమైయున్నది. దేవుని కుమారుడైన క్రీస్తు యూదులలో నుండి వచ్చునట్లు దేవుడు వారిని తన ప్రజలుగా చేసికొన్నాడు. మోషే ద్వారా దేవుడు ఇశ్రాయేలీయుల కిచ్చిన పది యాజ్ఞలు దేవుని కుమారుడు వచ్చువరకు వారికి సాంఘిక నైతిక పరిమితులను కల్పించి వారి ప్రవర్తనను అదుపులో యుంచాయి.

దేవుడిచ్చిన పది యాజ్ఞలలో మనం రెండు భాగాలను చూడ గలము. వాటిలో మొదటిది మానవునికి దేవుని యెడల ఉండవలసిన సంబంధాన్ని గూర్చి, రెండవది మానవునికి మానవునికి మధ్య యుండే సంబంధాన్ని గూర్చి యున్నవి. మొదటి భాగంలో దేవుని అద్వితీయ ఔన్నత్యమును గూర్చి చెప్పబడింది. దైవత్వాన్ని భౌతిక సంగతు

లతో వ్యక్తపర్చడం అసాధ్యమని చెప్పబడింది. దేవుని నామాన్ని వ్యర్థముగా వినియోగించుట నిషేధింపబడినది. మరియు దేవుని పరిశుద్ధ దినము యొక్క ప్రాముఖ్యత తెలియజేయబడింది.

రెండో భాగంలో తలిదండ్రుల సన్మానాన్ని గూర్చి చెప్పబడింది. మరల మానవుని ప్రాణం ప్రశస్తమైనది; నరహత్య చేయకూడదు. అట్లే స్త్రీ పురుషుల మధ్య లైంగిక పవిత్రతను గూర్చి చెప్పబడినది; వ్యభిచరించకూడదు. అదే విధంగా ఆస్థి హక్కు పరిరక్షింపబడింది; దొంగిలకూడదు. పరుని గౌరవ ప్రతిష్టలను భంగము చేయరాదు; అబద్ధ సాక్ష్యము పలుకకూడదు. మరల పొరుగువానిది ఏదియు ఆశించరాదు. దురాశ ఖండించబడింది. ఈ పది ఆజ్ఞలు దేవుని యెడల భయభక్తులను, మానవుని యెడల గౌరవమర్యాదలను మానవుని నుండి కోరుచున్నవి.

పది ఆజ్ఞలు ఎక్కువ నిషేధాజ్ఞలుగానే యున్నవి. అది ఇది చేయకూడదు అని అవి ఆజ్ఞాపించుచున్నాయి. ఇశ్రాయేలీయులు నాలుగు వందల సంవత్సరాలకు పైగా బానిసలుగా యుండి విడుదల పొందిన మూడు నెలల కాలములోనే ఈ ధర్మశాస్త్రము వారికియ్యబడింది. వారినొక జనాంగముగ చేసి నడిపించుటకు ఈ నిషేధాజ్ఞలు వారికవుసరం. ఇప్పుడే విడుదల పొందిన బానిసలు అర్థం చేసుకొనే భాషలో దేవుడు వారికీ యాజ్ఞల నిచ్చాడు.

సబ్బాతు దినమును గూర్చిన ఆజ్ఞ తప్ప మిగతా తొమ్మిది ఆజ్ఞలు క్రొత్తనిబంధనలోనికి కొనితేబడ్డాయి. అవి క్రీస్తు నియమములో భాగమైనందున వాటిని మనం అనుసరించాలి. ఎట్లొచ్చీ పది యాజ్ఞలు కంటె క్రీస్తు యొక్క క్రొత్తనిబంధన అతిశ్రేష్టమైనది. బైబిలు అంతటిలోను అతిశ్రేష్టమైన రెండు ఆజ్ఞలు పది యాజ్ఞల

లోనివి కావని మనం గమనించాలి. "నీవు నీపూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీపూర్ణ వివేకముతోను నీపూర్ణ బలముతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింప వలెనునది ప్రధానమైన ఆజ్ఞ... నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమింప వలెననునది రెండవ ఆజ్ఞ." వీటి కంటె ముఖ్యమైన ఆజ్ఞ మరేదియు లేదని యేసుప్రభువు చెప్పాడు (మార్కు 12 : 30, 31).

"నేను తప్ప వేరొక దేవుడు నీకుండ కూడదు" అనే యాజ్ఞ విగ్రహారాధనను ఖండించుచున్నది. అది అట్లుంటే దేవుని మనం పూర్ణ హృదయం, పూర్ణాత్మ, వివేకము, బలములతో ప్రేమించాలని క్రీస్తు బోధించాడు. అంతేకాదు దేవుడు ఆత్మ గనుక ఆయనను మనము ఆత్మతోను సత్యముతోను ఆరాధించాలని క్రీస్తు బోధించాడు (యోహా 4 : 24).

"నీవు దేని స్వరూపమునైనను చేసికొనకూడదు" అని నిషేధించబడితే, "చిన్నపిల్లలారా, విగ్రహముల జోలికి పోకుండ జాగ్రత్తగా ఉండుడి" యని క్రొత్తనిబంధన బోధించుచున్నది (1 యోహాను 5 : 21). మనము దేవుని తప్ప దేనిని లేక ఎవరిని ఆరాధించరాదు (ప్రక 19 : 10; మత్త 6 : 24).

"నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింప కూడదు" అని పది యాజ్ఞలలో చెప్పబడితే, "పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచబడునుగాక" యని ప్రార్థించుమని యేసుక్రీస్తు తన శిష్యులకు బోధించాడు (మత్త 6 : 9). అంతేకాదు, "నేను మీతో చెప్పునదేమనగా-మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతిమాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసి యుండునని" ఆయన హెచ్చరించాడు (మత్త 12 : 36).

"విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము" అను ఆజ్ఞ క్రొత్తనిబంధనలోనికి తేబడలేదు. యేసు ప్రభువు పాతనిబంధన కాలములో జన్మించాడు గనుక పాతనిబంధన ననుసరించాడు. దానిని ఆయన పూర్తిగ నెరవేర్చి ఎత్తి వేసాడు (గలతీ 4 : 4). క్రైస్తవులు సబ్బాతు దినమునగాక, ఆదివారమున దేవుని ఆరాధించాలి (అపొ. కా. 20 : 7; I కొరింథీ 16 : 1, 2).

'నీ తండ్రిని తల్లిని సన్మానించుమను' దానిని క్రీస్తు కూడ బోధించాడు (మార్కు 7 : 10-12). ఎఫెసీ 6 : 1-3లో పౌలు ఈ యాజ్ఞను మరల ఎత్తి చూపించాడు. యేసుప్రభువు దేవుని కుమారుడైయుండియు, ఇహలోక తలిదండ్రులకు ఆయన లోబడియుండెను (లూకా 2 : 51).

'నరహత్య చేయకూడదు' అని పాతనిబంధనలో చెప్పబడితే, "నేను మీతో చెప్పున దేమనగా-తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును, తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును, ద్రోహీ అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును" అని యేసుప్రభువు బోధించాడు. మరల "తన సహోదరుని ద్వేషించువాడు నరహంతకుడు, ఏ నరహంతకుని యందు నిత్య జీవ ముండదని మీరెరుగుదురు" అని 1 యోహాను 3 : 15లో వ్రాయబడి యున్నది. పాతనిబంధన పైపై క్రియలనే ఖండిస్తే క్రొత్త నిబంధన ఆ క్రియయొక్క మూలమును కనుగొని దానిని అక్కడే త్రుంచివేయ యత్నించుచున్నది. శరీర క్రియల కంటే హృదయ తలంపులనే అదుపులో యుంచుటకు క్రొత్త నిబంధన యత్నించుచున్నది. అందువలన మోషే ధర్మశాస్త్రము కంటె క్రీస్తు నియమము శ్రేష్ఠమైనది.

'వ్యభిచరింపకూడదు' అనే ఆజ్ఞ విషయంలో కూడ క్రీస్తు ఆ క్రియయొక్క మూలమునకే వెళ్ళి దానిని అక్కడే, హృదయంలోనే

త్రుంచివేయాలని బోధించాడు. "నేను మీతో చెప్పునదేమనగా, ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును" అని ఆయన బోధించాడు (మత్త 5 : 28).

'దొంగిలకూడదు' అని పాతనిబంధనలో చెప్పబడితే, "దొంగిలువాడు ఇక మీదట దొంగిలక అక్కర గలవానికి పంచిపెట్టుటకు వీలు కలుగునట్లు తన చేతులతో మంచి పని చేయుచు కష్టపడవలెనని" క్రొత్తనిబంధన చెప్పుచున్నది (ఎఫెసీ 4 : 28).

"నీ పొరుగువాని మీద అబద్ధ సాక్ష్యము పలుకకూడదు" అని పాతనిబంధనలో ఆజ్ఞాపింపబడితే, మనము ప్రేమ గలిగి సత్యము చెప్పుచు, అన్ని విషయములలో ఎదగాలి అని క్రొత్తనిబంధన బోధించుచున్నది (ఎఫెసీ 4:15). మరియు అబద్ధికులందరు అగ్ని గంధకములతో మండు గుండములో పాలు పొందెదరని అది చెప్పుచున్నది (ప్రక 21 : 8).

'నీ పొరుగువానిది యేదీ ఆశించకూడదు' అని పాతనిబంధన బోధించుచున్నది. అన్ని రకములైన లోభత్వాన్ని యేసుప్రభువు ఖండించాడు (లూకా 12 : 15). సరిగదా నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించాలని ఆయన బోధించాడు.

వీటన్నిటిని మనము పరిశోలన చేస్తే పాతనిబంధన కంటె క్రొత్తనిబంధన అతి శ్రేష్టమైనదని మనం గ్రహించ వచ్చును. క్రీస్తు యొక్క నియమము మన హృదయములను ఆకర్షింపజేయుటకు యత్నించుచున్నది. మోషే "ధర్మశాస్త్రము దేనికిని సంపూర్ణ సిద్ధి కలుగజేయలేదు గనుక ముందియ్యబడిన ఆజ్ఞ బలహీనమైనందునను నిష్ప్రయోజనమైనందునను అది నివారణ చేయబడియున్నది; అంత

కంటె శ్రేష్ఠమైన నిరీక్షణ దాని వెంట ప్రవేశ పెట్టబడెను. దీని ద్వారా దేవుని యొద్దకు మనము చేరుచున్నాము" (హెబ్రీ 7 : 19).

క్రీస్తు ఏర్పరచిన క్రొత్తనిబంధన ద్వారానే మనము దేవుని యొద్దకు చేరగలము. క్రీస్తే మనకు మోక్షమార్గము. ఆయనను నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును; నమ్మని వానికి శిక్ష విధించబడును (మార్కు 16 : 16). మోషే కంటే క్రీస్తు ఘనుడని నీవు నమ్ముచున్నావా ?

—జాషువా గూటం.

---

## పిల్లలను గూర్చి తండ్రి బాధ్యత

(గత సంచిక తరువాయి)

దైవజనులై యుండియు తండ్రిగా తమ బాధ్యతను నెరవేర్చ లేకపోయినవారు.

1. ఏలీ : ఇతడు యాజకుడు. షిలోహులో నున్న దేవుని మందిరములో యాజకుడు (1 సమూ 1:9; 1:24). ఇతడు యాజకుని గాను, న్యాయాధిపతిగాను 40 సం॥లు పని చేసెను (1 సమూ 4:18). ఇట్టి భక్తుని బిడ్డలను గూర్చి చెప్పబడిన మాటలు బహు విచారకర మైనవి.

"ఏలీ కుమారులు యెహోవాను ఎరుగనివారై, మిక్కిలి దుర్మార్గులై యుండిరి" (1 సమూ 2:12). ఏలీ కుమారులు 1. హొఫ్నీ 2. ఫీనెహాసు. వీరిద్దరు యాజకులుగా దేవుని మందిరములో సేవ చేయు చున్నారు. అయితే వీరు యెహోవాను ఎరుగని వారైరి. దేవునిని గూర్చిన జ్ఞానము, భయము లేకుండా పాప జీవితము జీవించుచు దేవుని సేవ చేసేవారున్నారంటే అది ఎంతో భయంకరము. వీరు చేసే

దుర్మార్గపు పనులు ఏవనగా — దేవుని ఆజ్ఞను అతిక్రమించి దురాశపరులై బలులర్పించు వారి యొద్దనుండి బలిపశువు మాంసము దేవుడు నియమించిన దానికంటె ఎక్కువగా బలవంతముగా లాగుకొనుచుండిరి. ......అందువలన జనులు యెహోవాకు నైవేద్యము చేయుట మాని దానియందు అసహ్యపడుటకు ఆ యౌవనులు కారణమైరి గనుక వారి పాపము యెహోవా సన్నిధిని బహు గొప్పదాయెను" (I సమూ 2 : 13-17). దేవుడు చెప్పిన మాటలు ఏవనగా "నా నివాస స్థలమునకు నేను నిర్ణయించిన బలి నైవేద్యములను మీరేల తృణీకరించుచున్నారు" (I సమూ 2 : 29). క్రొవ్వును దేవునికి అర్పించవలెను (లేవి 7 : 23-25). అయితే వీరు క్రొవ్వును కూడా ప్రజల యొద్దనుండి బలవంతముగా తీసికొనుచుండిరి (I సమూ 2 : 15-17, 29). దేవునికర్పించువాటిని తిని క్రొవ్వుచు గేహజీవలె వారి నాశనమునకు వారు సిద్ధపడిరి.

ఏలీ కుమారులు "ప్రత్యక్షపు గుడారము యొక్క ద్వారము దగ్గరకు సేవ చేయుటకు వచ్చిన స్త్రీలతో శయనించుట" (I సమూ 2 : 22). పరిశుద్ధులై యుండవలసిన వీరు తమ శరీరములను పాపమునకు అప్పగించిరి. దానికి దేవుడు వారికి ఇచ్చిన శిక్షను I సమూ 2:29లో చదువగలము.

తన కుమారులు తమ్మును తాము శాపగ్రస్థులుగా చేసికొనుచున్నారని తానెరిగియు వారిని అడ్డగించలేదు. కనుక ఒక్కదినమందే ఏలీ కుటుంబము నాశనమయ్యెను (I సమూ 4 : 14-22).

2. **సమూయేలు :** ఇతడు ప్రవక్త, యాజకుడు, న్యాయాధిపతి. "ఇతని కుమారులగు యోవేలు, అబీయ ఇశ్రాయేలీయుల న్యాయాధిపతులుగా ఉండిరి. వీరు అతని ప్రవర్తన అనుసరింపక ధనాపేక్షకులై లంచము పుచ్చుకొని న్యాయమును త్రిప్పివేయగా"

(I సమూ॥ 8 : 1-5). సమూయేలు బాల్యము నుండి దేవునికి సమర్పించ బడినవాడు. ఇతడు మచ్చలేనట్టి పరిశుద్ధ జీవితమును జీవించెను (I సమూ॥ 9 : 6). ఇతడు ప్రార్థనా పరుడు (I సమూ॥ 12 : 23). సమూయేలు ప్రవక్తల పాఠశాలను స్థాపించి దానికి నాయకుడుగా ఉండెను (I సమూ॥ 19 : 18-24). ఇట్టి దైన జనుని బిడ్డలు ధనాపేక్షులు, లంచగొండులు న్యాయమును త్రిప్పివేయువారు అగుటకు కారణమేమి? సమూయేలు గిల్గాలుకు, మిస్పాకు, బేతేలుకు, రామకు వెళ్ళుచు ఆయాచోట్ల న్యాయము తీర్చుచు తన దినములు ఎక్కువగా ఇంటియొద్ద ఉండలేని కారణమున (I సమూ॥ 7 : 15) తన కుటుంబ విషయము పట్టించుకోలేదు. కనుక తన కుమారులు అట్టి ప్రవర్తన గలవారైరి. అనేకమంది దైవసేవకుల పరిస్థితి ఈ విధముగానే ఉన్నది.

3. దావీదు : ఇతడు రాజు. "అప్పుడు దావీదు రాజు నా కుమారుడా, అబ్షాలోమా, నా కుమారుడా అబ్షాలోమా అని కేకలు వేయుచు అయ్యో నా కుమారుడా నీకు బదులుగా నేను చనిపోయిన యెడల ఎంత బాగుండును" (I సమూ॥ 18 : 14). దావీదు గొప్పతనమును గూర్చి I సమూ॥ 16 : 18; అపొ. కా. 13:22 లో చదువగలం. దావీదు ఊరియా భార్యయైన బత్షెబాతో వ్యభిచరించి, ఆమె భర్తను చంపించి దేవునికి విరోధముగా నడచెను (II సమూ॥ 11, 12 అధ్యాయములు). దావీదు కుమారుడు అమ్నోను తామారను దావీదు కుమార్తెతో పాపము చేసెను (II సమూ॥ 13 : 1-22). ఈ కారణాన అబ్షాలోము అమ్నోనును హత్యచేయించెను. (II సమూ॥ 13 : 28). అబ్షాలోము దావీదు మీద తిరుగుబాటు చేసి తానే రాజును కావలెనని దావీదును చంపజూచెను (II సమూ॥ 15 అధ్యా॥). ... అబ్షాలోముకు గుడారము వేయగా ఇశ్రాయేలీయు లందరికి తెలియునట్లు తన తండ్రి ఉపపత్నులతో కూడెను" (II సమూ॥ 16:22). ఇతడు

తన తండ్రిని తరుముచుండగా తల వెండ్రుకలు మస్తకి వృక్షమునకు చుట్టుకొని వేళ్లాడు చుండగా యోవాబు బాణములతో అతనిని కొట్టి చంపెను(II సమూ 18:15). ఈ వార్తవిని దావీదు ఏడ్చెను (II సమూ 18 : 32, 33). దావీదు దైవజనుడై యుండియు ఈలాగు బిడ్డల యెదుట పాపజీవితమును జీవించి నందున పిల్లలు, కుటుంబము కట్టి శిక్ష అనుభవించిరి.

తండ్రులు బిడ్డల ముందు ఏలాగు నడిచిన—బిడ్డలు ఆలాగు ననే నడచుటకు ప్రయత్నింతురు. తండ్రి బాధ్యతను తండ్రి గుర్తించ వలెను. పిల్లలను గూర్చి తండ్రిని దేవుడు లెక్క అడుగును. ఏలీ తన కుమారుల మార్గమును సరిచేయనందున నాశనమయ్యెను. సమూయేలు దేవుని సేనలో నిమగ్నుడై కుటుంబమును నిర్లక్ష్య పెట్టి నందున పిల్లలు చెడిపోయిరి. దావీదు పాపము చేయుటవలన పిల్లలు అదేస్థితికి చేరుకొని ఘోరముగా చంపబడిరి. దేవుడు నిన్ను తండ్రిగా చేసి బహుమానముగా బిడ్డల నిచ్చియున్నాడు. వారిని దేవుని పోలికగా ప్రియమైన బిడ్డలవలె పెంచు బాధ్యత నిచ్చియున్నాడు. ఆ బాధ్యత తండ్రియైనవాడు నెరవేర్చవలెను.

— పి. ప్రకాశము, హైదరాబాదు.

---

## సవరణ

1990 మార్చి నెల సంచిక 17వ పేజీ రెండో పేరా 5వ లైనులో పురుషులు మాత్రమే సంఘసభ్యులుగా యుండవలెనను మాటను సవరించి పురుషులు మాత్రమే సంఘ పెద్దలుగా యుండవలెనని చదువవలెను. ముద్రించుటలో జరిగిన పొరబాటుకై చింతించుచున్నాము.

# సత్యవాక్కు చదువరులకు విజ్ఞప్తి

సత్యవాక్కు పత్రిక ద్వారా గత పది సంవత్సరాలనుండి ప్రతి మాసము విడువక మీ గృహాన్ని దర్శించుచున్నాము. మరియు సత్యవాణి రేడియో కార్యక్రమం ద్వారా గత 14 సంవత్సరాలుగా ఇంచుమించు ప్రతిరోజు కొన్ని లక్షల గృహాలలో సువార్త అందించుచున్నాము. మేము ప్రచురించిన వివిధములైన ఆధ్యాత్మిక పుస్తకముల వలన అనేక వేలమంది ఆత్మీయంగా మేల్కొల్పబడ్డారనుటలో సందేహం లేదు. మాస పత్రికను చందా లేకుండగనే కొన్ని వేల మందికి పంపుచున్నాము. అట్లే పుస్తకాలు కరపత్రాలు వగయిరా కూడ అతి స్వల్ప ఖర్చుతో మీకందించగలుగుచున్నాము.

వీటన్నిటితో బాటు బైబిలు కరస్పాండెన్సు కోర్సు పనికూడ నిర్విరామంగా జరిగించబడుచున్నది. బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో ఇప్పటికి ఇంచుమించు 5 లక్షలమంది చేరియున్నారు. ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా బైబిలు నేర్చుకొనుచున్నారు.

పైన చెప్పబడిన ఈ పని అంతయు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లోని ఒక చిన్న గదిలో నుండియు, జాష్షువా గూటంగారి గృహమునుండియు జరిగించబడుచుండేది. అయితే దేవుని కృప వలన గత సంవత్సరం కాకినాడలో ఈ పని నిమిత్తము ఒక స్థలం కొనగలిగాము. ఆ స్థలంలోయున్న పాత బిల్డింగ్‌ను పడగొట్టి ఒక క్రొత్త బిల్డింగును కట్టుటకు సంకల్పించి యున్నాము. ఈ క్రొత్త బిల్డింగ్‌లో సత్యవాణి, సత్యవాక్కు, కరస్పాండెన్సు కోర్సుల ఆఫీసులు మాత్రమే గాక స్థానిక సంఘ కూడికలకు ఒక ఆడిటోరియమ్ కూడ యుండును. మరియు లెక్చర్‌షిప్‌లకు, సెమినార్‌లకు ఉపయోగింపబడే ఒక పెద్ద ఆడిటోరియమ్ పై అంతస్థులో యుండును.

స్థలాన్ని సేకరించుటలో బెయిలీగారు ఆర్థికంగా చాల సహాయ పడ్డారు. గనుక బిల్డింగ్‌ను నిర్మించుటలో భారతీయ సహోదరులు సహాయపడాలని కోరుచున్నాము. కాకినాడ నుండి మేము జరిగించు చున్న పనిద్వారా ఇంచుమించు తెలుగువారంతా ఆశీర్వదించబడు చున్నారు. గత రెండు దశాబ్దాలకు పైగా మేము చేయుచున్న పని ద్వారా మీరు సంతృప్తి చెందినయెడల ఈ నూతన భవనమును నిర్మించుటలో మాకు చేయూత నీయండి. దేవుని నామ ఘనత కొరకు, క్రీస్తు రాజ్య విస్తరణ కొరకు సంకల్పించిన ఈ భవన నిర్మాణము నిమిత్తమై మీ విరాళములు పంపించండి. సహో. బెయిలీగారు మన దేశంలో జరిగించిన సత్య సువార్త సేవకు జ్ఞాపకార్థముగా కూడ యిది నిర్మించబడుచున్నది.

మీరు విరాళము పంపునపుడు అది భవన నిర్మాణ నిమిత్తము అని తప్పక తెలియజేయండి. వంద రూపాయలుగాని, దానికి అదనంగా గాని పంపిన వారి పేర్లు జాబితా సత్యవాక్కులో ఎప్పటికప్పుడు ప్రచురింపబడును. మీరివ్వదలుచుకొన్న కానుక స్వల్పమైనా, అధిక మైనా ఘనంగా ఎంచబడును. మీ విరాళములను దిగువ చిరునామాకు పంపించండి. డ్రాఫ్టులు వగయిరా జాషువా గూటంగారి పేరున గాని, సత్యవాణి పేరునగాని పంపించండి. మాతో కలసి ప్రార్థించండి. వందనములు.


అడ్రస్సు:

**SATYA VANI,**

**Seshagirirao St.**

**KAKINADA-533 004. (A.P.)**

## పిలుపులో మలుపు (ఫిలిప్పీ 3 : 12-16)

పాపి :-(రోమా 3 : 11-23, 1 యోహాను 3 : 4, 5:17).

లోకంలో నేనొక ఏకాకిని దేశదిమ్మరిని
సత్యమునకు విరోధంగా అబద్ధమాడితిని
సకల దుర్నీతికి దాస్యము చేసియుంటిని
జీవించుదుననే ఆశ లేశమైన లేనివాడిని
చావుకై పట్టుబడిన ప్రధాన పాపిని ద్రోహిని ! (రోమా 7:24).

సువార్త పిలుపు :-(యోహాను 5:24, మార్కు 16:16, రోమా 8:1).

చిరాయువుంది రమ్మంది సువార్తా స్వరం
మారుమనస్సు పొందమంది సత్యవాక్య సౌరభం
బాప్తిస్మము తప్పదన్నది నిత్యదేవుని నియమం
నూతన జీవ మిదే యన్నది క్రీస్తు మృతి, పునరుత్థానం
మరణం నుండి విడిపించింది దైవ కృపమాత్రం !

రక్షణ నిశ్చయత :-హెబ్రీ 10 : 10-25; 1 యోహాను 1 : 7).

క్రీస్తు రక్తముతో నన్ను శుద్ధీకరించాడు
నా పాపదాస్య శృంఖలాలు తెంచాడు
తన శరీరమనే సంఘంలో నన్నుంచాడు
జ్ఞాపకార్థం శరీరం రక్తం నాకు పంచాడు
జగత్తుకు "ఉప్పు-వెలుగు"గా నన్నుంచాడు !

క్రైస్తవుని కర్తవ్యము :-(II కొరి 2:14-17, 3:3-6, 2 తిమో 2:3-5)

యేసుక్రీస్తుకు నే నిప్పుడొక శిష్యుడను
ఆయన పక్షమున శ్రమించు సైనికుడను
ఆయన రక్షణ సువార్తను ప్రకటించు పత్రికను
ఆత్మ సత్యారాధికులలో ఒక ఆరాధికుడను
ఆయ నిచ్చే బహుమతికై నిరీక్షించు క్రైస్తవుడను !

—సామ్యూల్ జాన్ మేడిది, కొణితివాడ.

## "నన్ను జ్ఞాపకము చేసుకొనుటకై దీనిని చేయుడి"

## ( Do This in Remembrance of me )

మత శాఖలవారు ఈస్టర్, క్రిస్మస్, గుడ్ ఫ్రైడే, మట్టలాది వారం మొదలగు పండుగలు ఆచరిస్తారు. అయితే వీటన్నిటి గూర్చి బైబిలు ఏమి చెప్పుచున్నదో? లేఖనములనుబట్టి కనుగొందాము.

ఆదికాండము నుండి మలాకీ గ్రంథము వరకు క్రీస్తు జ్ఞాపకార్థంగా ఏమైనా చేయబడాలని చెప్పబడలేదు. అయితే సువార్తలలోను పత్రికలలోను క్రీస్తు జ్ఞాపకార్థంగా ఒక విందు స్థాపించబడినట్లు కనుగొనగలం. అదే ప్రభురాత్రి భోజనం.

క్రీస్తు మన నిమిత్తం మరణించి పాపమునుండి మనలను విడుదల చేయు నిమిత్తం దేవుడాయనను పంపాడు (రోమా 5:8). ఆయన చనిపోవకముందు ఆయనను జ్ఞాపకము చేసుకొను నిమిత్తం శిష్యులతో ప్రభురాత్రి భోజనము నాచరించాలని ఆయన ఆజ్ఞాపించాడు (మత్తయి 26:26-28; మార్కు 14:22-25; లూకా 22:14-19).

"వారు భోజనము చేయుచుండగా యేసు ఒక రొట్టె పట్టుకొని, దాని నాశీర్వదించి, విరిచి తన శిష్యులకిచ్చి మీరు తీసికొని తినుడి; ఇది నా శరీరమని చెప్పెను. మరియు ఆయన గిన్నె పట్టుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి వారికిచ్చి-దీనిలోనిది మీరందరు త్రాగుడి; ఇది నా రక్తము అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము అని చెప్పెను (మత్త 26:26-28). నాలుగు సువార్తలలోను ఈ సందర్భము మనకు కన్పడుచున్నది. అయితే లూకా 22 : 19లో "నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని చేయుడని" ఆయన చెప్పెను. మరల కొరింథులోని సంఘము ప్రభురాత్రి భోజనాన్ని సరియైన రీతిలో ఆచరించుటలేదని గ్రహించి అపొ. పౌలు

దానిని గూర్చిన వివరణ వారికి వ్రాసెను (1 కొరింథీ 11 : 20-34). 23వ వచనంలో అతడిట్లు పలికాడు: "నేను మీకు అప్పగించిన దానిని ప్రభువు వలన పొందితిని. ప్రభువైన యేసు తాను అప్పగింపబడిన రాత్రి, యొక రొట్టెను ఎత్తుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి దానిని విరిచి, యిది మీ కొరకైన నా శరీరము, నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను".

సువార్తలలో యేమున్నదో దానినే పౌలు ఎత్తి చూపించాడు. నిజానికి ప్రభురాత్రి భోజనం తప్ప క్రీస్తు జ్ఞాపకార్థం మరేమైనను చేయబడాలని బైబిలులో చెప్పబడలేదు. మన ప్రభువు జ్ఞాపకార్థంగా క్రిస్మసుగాని, ఈస్టరుగాని ఆచరించాలని చెప్పబడలేదు. వీటిని ఆచరించువారు దేవుని గాక మానవులనే సంతోషపెట్టువారై యున్నారు. వీటిని ఆచరిస్తూ దేవుని చిత్తాన్ని జరిగించుచున్నామనుకొను వారికో ప్రశ్న: "వారెవరి బోధను అనుసరించుచున్నారు? లేఖనములను పరిశోధించి వాటి ననుసరించుట మంచిది కాదా?"

## ఏరోజున పాలొనాలి?

పాతనిబంధన కాలంలో లేవీ యాజకులు ప్రతి శనివారం దేవుని మందిరంలో సముఖపు రొట్టెలను సేవించినట్లు మనం చూడగలము (లేవీ 24 : 8-9). క్రొత్తనిబంధనలో ప్రతి క్రైస్తవుడు యాజకుడే గనుక (1 పేతు 2 : 9) అతడు ప్రతి ఆదివారమున ప్రభురాత్రి భోజనంలో పాల్గొనాలి. అపొ. కా. 20:5-7లో పౌలును మరి కొందరు సహోదరులును త్రోయకు వెళ్ళి అక్కడ ఆరు దినములు గడిపారు. వారు ఆదివారము వరకు అక్కడ కనిపెట్టి ప్రభురాత్రి భోజనంలో పాల్గొన్నారు.

—

ఆదిమ క్రైస్తవులు వారంలో మొదటి దినాన్న కూడుకొన్నట్లు

బైబిలు విపులీకరించుచున్నది (అపొ. కా. 20 : 7). వారు కూడు కొన్నప్పుడు ప్రభురాత్రి భోజనంలో పాల్గొన్నారు (అపొ.కా. 2:42). ప్రభురాత్రి భోజనం సంవత్సరానికొకసారి, మూడు నెలలకొకసారి, నెలకొకసారి గాక ప్రతి ఆదివారమున ఆచరించాలి.

దేవుని వాక్యం ఇట్లు చెప్పుచున్నది: "క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరించనివాడు; ఆ బోధయందు నిలిచి యుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు" (2 యోహాను : 9). మిత్రుడా, నీవు అంధులైన నాయకులనుగాక క్రీస్తు బోధననుసరిస్తే రక్షింపబడగలవు (మత్త 7 : 25). యేసు ప్రభువు ఈ లోకంలో 33 సంవత్సరముల పాటు జీవించినను ఆయన తన జన్మదినోత్సవాన్ని ఎక్కడైనా, ఎప్పుడైనా జరిగించుకొన్నట్లు రికార్డు యేమీ లేదు. క్రీస్తు జన్మ దినం ఎప్పుడో దేవుడు లేఖనాల్లో మన కెందుకు తెలియచేయలేదు? దేవుడు జ్ఞాని, జగత్పునాది వేయబడక ముందునుండే ఆయన ఉండియున్నాడు. క్రిస్మసును క్రీస్తు జన్మదినంగా ఆచరించే వారు దేవునికి తన కుమారుని జన్మదినం జ్ఞాపకం చేయ యత్నించుట లేదా? మనమొక తేదీ నిర్ణయించడానికి గాను క్రీస్తు జీవితం ఈలోకంలో ఆరంభము కాలేదు. క్రీస్తును జ్ఞాపకముంచుకొనుటకు గాను ప్రభురాత్రి భోజనంలో పాల్గొనుచు దేవునికి మనం విధేయత చూపాలి. "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" అని క్రీస్తు యిచ్చిన హెచ్చరిక ఇంకా అమలులోనే యున్నది (యోహాను 14 : 15),

— ప్రిన్సెస్ K. నాయర్

## రెవరెండ్ అను బిరుదు సంగతియేమి ?

### ( What about the title Reverend ? )

కొందరు బోధకులను రెవరెండ్ అని పిలుస్తారు. మరి కొందరు అట్లు పిలిపించు కొంటారు. మతశాఖలనుండి క్రీస్తు సంఘములో ప్రవేశించిన కొందరికి ఇంకా ఈ బిరుదంటే చాల యిష్టము. బహుశ వారికి దీనిని గూర్చిన సత్యం తెలియదు. బైబిలును చదివినట్లయితే ఈ బిరుదును ధరించుకొనుట, లేక రెవరెండ్ అని ఒక మానవుని సంబోధించుట సరియైన విధానం కాదని గ్రహింపవును.

'రెవరెండ్' అను పదము బైబిలులో ఎక్కడ కన్పడుచున్నదో నీకు తెలుసా ? అదెన్ని సార్లు ఆ గ్రంథంలో యున్నదో తెలుసా ? దాని నిర్వచనం నీకు తెలుసా ? బహుశా దీనిని గూర్చి నీ వెన్నడు తలంచి యుండలేదేమో.

రెవరెండ్ అను పదము ఇంగ్లీషు బైబిలులో ఒకే ఒక్కసారి కన్పడుచున్నది. "Holy and Reverend is His Name" అని కీర్తన 111 : 9లో యున్నది. అంటే, "ఆయన నామము పరిశుద్ధమైనది, పూజింపదగినది" అని యర్థము. ఆయన యదార్థవంతుడు, పవిత్రుడు, గంభీరుడు, పరిశుద్ధుడు. అందువలన ఆయన నామము పరిశుద్ధమైనది, పూజింపదగినది.

దేవుని కున్న ఈ ప్రత్యేక లక్షణమును మనం మానవునికి వర్తింపచేయుట మంచిది కాదు. ఏ మానవుడు పూజింపబడ దగిన వాడు కాడు. దేవుడే పూజింపబడ దగినవాడు (ప్రకటన 22 : 9).

మతసంబంధమైన బిరుదులు ధరించుటను యేసు ప్రభువు నిశితంగా ఖండించాడు. "మీరైతే బోధకులని (రబ్బీలని) పిలువబడవద్దు. ఒక్కడే మీ బోధకుడు, మీరందరు సహోదరులు, మరియు భూమి

మీద ఎవనికైనను తండ్రి అని పేరు పెట్టవద్దు; ఒక్కడే మీ తండ్రి; ఆయన పరలోకమందున్నాడు. మరియు మీరు గురువులని పిలువబడవద్దు; క్రీస్తు ఒక్కడే మీ గురువు" (మత్తై 23 : 8-10).

మతసంబంధమైన బిరుదులను ఆయన ఇట్లు ఖండించియుండగా, కొందరు వాటిని ధరిస్తూ ఉప్పొంగి పోవుదురేల ? క్రీస్తు బోధ శ్రేష్ఠమైనది.. "మీరందరు సహోదరులు !". మనందరినీ ఆయన సమానులుగా చేసాడు. గురువులు (Clegy) లౌకికులు (Laity) అను వ్యత్యాసం బైబిలు నందగుపడుటలేదు.

తన అనుచరుల మధ్య ప్రత్యేకతను సూచించేది ఏదైనా యుంటే దాన్ని కూడ యేసుప్రభువు ఖండించాడు. క్రీస్తు కాలము నాటి మతనాయకులు గర్వముతో నిండినవారై మిగిలిన వారికంటే ప్రత్యేకంగా కనబడాలని ప్రయత్నించే వారు. మార్కు 12:38-40లో ఆయన చెప్పుదానిని వినండి : "శాస్త్రిలను గూర్చి జాగ్రత్త పడుడి. వారు నిలువుటంగీలు ధరించుకొని తిరుగుటను, సంత వీధులలో వందనములను, సమాజ మందిరములలో అగ్రపీఠములను, విందులలో అగ్రస్థానములను కోరుచు... దీర్ఘ ప్రార్థనలు చేయుదురు. వీరు మరి విశేషముగా శిక్ష పొందుదురనెను". మానవులు మత బిరుదులను, ప్రత్యేక దుస్తులను ధరించునపుడు వారిని గూర్చి జాగ్రత్తయని యేసు ప్రభువు చెప్పారు.

## డబ్బు

## ( Money )

నేటి సమాజంలో డబ్బు అత్యంత ప్రాధాన్యమైనది. ఒకడు సంపాదించే దానిని బట్టి అతడు అల్పుడో లేక ఘనుడో [illegible]

నిర్ణయిస్తుంది. నేటికాలపు వాతావరణం అట్లున్నది. ఒకని ఘనతను డబ్బును బట్టి అంచనా వేయవలసి వస్తే యేసు ప్రభువు ఏమంత ఘనుడు కాదు ! ఏలయనగా ఆయన పన్ను చెల్లించవలసి వచ్చినప్పుడు, ఒక చేప నోటిలో నున్న నాణెము నుపయోగించవలసినదని ఆయన పేతురుకు చెప్పాడు (మత్త 17 : 27). ఎందువలన ఆయన దగ్గర ఒక్క చిల్లి గవ్వకూడా లేనందువలన !

క్రీస్తు ఒక పశువుల పాకలో పుట్టాడు. మన బిడ్డలు ఒక మంచి నర్సింగ్ హోమ్‌లో పుట్టకపోతే విభ్రాంతి చెందే రోజులివి. ఆయన చనిపోయినప్పుడు సైనికులు ఆయన అంగీని గూర్చి చీట్లు వేసుకోవలసి వచ్చింది (మత్త 27 : 35). ఈ లోకంలో ఆయనకున్న ఆస్థి అంతా అదొక్కటి మాత్రమే ! కేవలం డబ్బే ప్రధానమైతే క్రీస్తు అల్పుడే. ఏలయనగా, "నక్కలకు బొరియలును ఆకాశ పక్షులకు నివాసములును కలవుగాని మనుష్యకుమారునికి తలవాల్చుకొనుటకైనను స్థలము లేదు" (మత్త 8 : 20).

డబ్బు సంపాదించడం, దాన్ని పొదుపు చేయడం అవసరం. అది సవ్యమైనదే. అయితే మనం సంపాదించే మొత్తం మాత్రం దేవుని దీవెనల కొలబద్ద కాదు. నీతిమంతుల మీదను అనీతిమంతుల మీదను సూర్యుడుదయించుచున్నాడు (మత్త 5 : 45). నిజానికి ఈ లోకంలో దుష్టులు వర్ధిల్లుటయు దేవుని బిడ్డలు బాధలుపడుటయు జరుగును. ఈ విషయాన్ని గూర్చి బాగుగా ఎరిగి యుండవలసిన క్రైస్తవులు సహితము తాము సంపాదించే డబ్బును బట్టి అల్పులమని లేక ఘనులమని అంచనా వేసికొనడం విచారకరం.

ధనవంతుడు, లాజరుల సందర్భము గుర్తున్నదా ? తనవొళ్లంతా కురుపులతో నిండియున్న దరిద్రుడు లాజరు. అతడును కుక్కలును ధనవంతుని బల్లమీదనుండి పడు రొట్టె ముక్కలకొరకు ఎదురు చూచే

వారు. చివరకు ధనవంతుడు, లాజరు కూడ చనిపోయారు. లాజరు అబ్రాహాము రొమ్మున ఆనుకొనుటకు కొనిపోబడెను. ధనవంతుడు పాతాళములో యాతన పడుచుండెను. అబ్రాహాము అతనిని ఇట్లు గద్దించెను : "కుమారుడా, నీవు జీవిత కాలమందు నీ కిష్టమైన సుఖము అనుభవించితివి; ఆలాగుననే లాజరు కష్టము అనుభవించెనని జ్ఞాపకముంచుకొనుము. ఇప్పుడైతే వాడు ఇక్కడ నెమ్మది పొందుచున్నాడు, నీవు యాతన పడుచున్నావు" (లూకా 16 : 25). ఒకడు అల్పుడో లేక ఘనుడో నిర్ణయించుటకు డబ్బు మూలము కాదు !

— టామ్ కెల్లన్.

---

Regd. No. H/KD—45/KD.R.O.

*From*
**SATYAWAKKU**
**P.O. Box. 80**
**KAKINADA-533 001**

**No.**

**To**

..............................
..............................
..............................
..............................